సాక్షి రంగారెడ్డి

బుధవారం ׀ 26 ׀ మార్చి ׀ 2025




స్కూల్ బస్‌లో మంటలు

షార్ట్ సర్క్యూట్‌తో స్కూల్ బస్‌లో మంటలు చెలరేగిన ఘటన సాగర్ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. 8లో▸



ముగిసిన అంత్యక్రియలు

చంపాపేట్‌లో హత్యకు గురైన న్యాయవాది ఇజ్రాయిల్ అంత్యక్రియలు మహేశ్వరం మండలం తుమ్మలూరులో ముగిశాయి. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధవారం	గురువారం
సా. 6.34 గం.	ఉ. 4.53 గం.

న్యూస్‌రీల్

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్‌రూరల్: పండుగలను అందరూ కలిసి మెలిసి ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ రంగస్వామి అన్నారు. రంజాన్, ఉగాది పండుగలను పురస్కరించుకొని మంగళవారం షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుగ్గారెడ్డి గార్డెన్‌లో శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రంజాన్, ఉగాది పండుగలు వెనువెంటనే ఉన్నందున హిందూ ముస్లింలు కలిసికట్టుగా జరుపుకోవాలని సూచించారు. పండుగల సమయంలో ఒకరినొకరు గౌరవించుకోవాలని, దీంతో అందరి మధ్య సోదర భావం మరింత పెంపొందుతుందని తెలిపారు. దేవాలయాలు, మసీదుల వద్ద పూజలు, ప్రార్థనలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సునీత, వివిధ పార్టీల నాయకులు బాబర్‌ఖాన్, అందె బాబయ్య, జమృత్‌ఖాన్, సర్వర్‌పాషా, చెంది మహేందర్‌రెడ్డి, ప్రశాంత్, ముక్తార్ అలీ, అన్వర్, అసద్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మాతృభూమి పట్టణ మహిళా స్వశక్తి సమాఖ్య అధ్యక్షురాలు జయమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఆఫీస్ సబార్డినేట్, వాచ్‌మన్, శానిటరీ వర్కర్ ఉద్యోగాలను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు కనీస విద్యార్హత పదో తరగతి ఉండాలని, 18 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 29వ తేదీ వరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఉన్న మాతృభూమి పట్టణ మహిళా స్వశక్తి సమాఖ్య మెప్మా సెక్షన్‌లో దరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు.

విద్యార్థుల ఉన్నతికి ఏఐ దోహదం



తరగతి గదిని ప్రారంభిస్తున్న జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి జయచంద్రరెడ్డి

కేశంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేవిధంగా ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)తో పాఠాలు బోధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రాథమిక అక్షరాస్యత మరియు సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి జయచంద్రరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాలకు మంజూరైన ఎఫ్ఎల్ఎన్ సిస్టంను మంగళవారం మండల విద్యాధికారి చంద్రశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 3 నుండి 5వ తరగతి విద్యార్థులకు ఏఐ అభ్యాసన తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు పాఠాలను అర్థ చేసుకొని సంభాషించి అన్ని రంగాల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చేందుకు ఎఫ్ఎల్ఎన్ ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే అక్షరాస్యత మరియు సంఖ్యాశాస్త్రంలో తమ సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్పీలు శరత్‌చంద్ర, స్వప్న, ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు లలితకుమారి, కళ్యాణి, శ్రీదేవి, స్రవంతి, మంజుల, సీఆర్పీలు రామకృష్ణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.1.30 కోట్ల నగదు పట్టివేత

చాంద్రాయణగుట్ట: ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1.30 కోట్ల నగదును చాంద్రాయణగుట్ట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ గురునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట ఫూల్‌బాగ్ జంక్షన్ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో అటుగా వచ్చిన కియా కారును నిలిపి తనిఖీ చేయగా మహ్మద్ యూసుఫుద్దీన్, సయ్యద్ అబ్దుల్ హదీల వద్ద రూ.1.30 కోట్ల నగదు లభ్యమైంది. డబ్బుకు సంబంధించిన వివరాలు కోరగా, రియల్ ఎస్టేట్ వ్యాపారులమని, ల్యాండ్ కొన్నామని, అందుకు చెల్లించాల్సి ఉందని వారు పేర్కొన్నారు. సరైన పత్రాలు చూపని కారణంగా ఐటీ అధికారులకు అప్పగించారు.

బాలురు 18,384 ׀ బాలికలు 16,993



జిల్లాలో ఏటా పడిపోతున్న బాలబాలికల నిష్పత్తి

2024-25లో ప్రతి వెయ్యి మంది బాలురకు 924 మందే బాలికలు

ఆడపిల్లలపై ఇప్పటికీ కొనసాగుతున్న వివక్ష

ఖమ్మం జిల్లాకు చెందిన క్యాబ్ డ్రైవర్ పదేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. భార్యాపిల్లలను వెంట తీసుకుని శంషాబాద్ సమీపంలోని శంకరాపూర్‌కు వలసవచ్చాడు. తనకు వంశోద్ధారకుడిని కనివ్వాలని భార్యపై ఒత్తిడి తెచ్చాడు. మానసికంగానే కాకుండా శారీరకంగా వేధిస్తుండటంతో పెద్ద మనుషులను ఆశ్రయించింది. అయినా భర్త ప్రవర్తనలో మార్పు రాక పోవడంతో చివరికి శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అత్తాపూర్ హసన్‌నగర్‌కు చెందిన ఓ ఏసీ టెక్నీషియన్‌కు సులేమాన్‌నగర్‌కు చెందిన మహిళతో వివాహమైంది. చాంద్రాయణగుట్టలోని బాబానగర్‌లో కాపురం పెట్టారు. వీరికి ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. ఆమె మళ్లీ గర్భం దాల్చింది. అప్పటి నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. మూడో సంతానంలోనూ మళ్లీ ఆడబిడ్డ పుడుతుందనే అనుమానంతో భర్త నెల రోజుల క్రితం తల్లీబిడ్డలను నడిరోడ్డున వదిలేసి వెళ్లాడు.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ.. ఆడబిడ్డలపై మాత్రం ఇప్పటికీ వివక్ష కొనసాగుతూనే ఉంది. పుట్టుక నుంచి చదువు, తినే తిండి, వేసుకునే బట్టలు ఇలా అన్నింట్లోనూ వివక్ష ఎదుర్కొంటూనే ఉంది. సమాజంపై అంతో ఇంతో అవగాహన ఉన్నవాళ్లు సైతం అదే ధోరణిలో వ్యవహరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. పుత్రుడు పుడితే తమను పున్నామ నరకం నుంచి తప్పిస్తాడనే భావన ఇప్పటికీ మెజార్టీ తల్లిదండ్రుల్లో ఉంది. అంతేకాదు తమ తర్వాత వంశం అంతరించిపోకుండా అలాగే కొనసాగుతుందనే నమ్మకం. ఆడపిల్లకు చదువు చెప్పించడం, పెళ్లి చేయడం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఇప్పటికీ భారంగా భావిస్తున్నారు. కడుపులో పెరుగుతున్నది ఆడబిడ్డ అని తెలిస్తే చాలు.. కన్ను తెరవకముందే కాటికి పంపేస్తున్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని తెలిసీ కొన్ని డయాగ్నోస్టిక్ సెంటర్లు కాసులకు కక్కుర్తిపడి యథేచ్ఛగా పరీక్షలు చేస్తున్నాయి. మొదటి, రెండో కాన్పు తర్వాత ఎక్కడ మళ్లీ ఆడబిడ్డే పుడుతుందో అనే భయంతో నిండు గర్భిణులను వదిలేస్తున్న భర్తలూ లేకపోలేదు. అత్తామామలు, ఆడబిడ్డలు, భర్త తరఫు ఇతర బంధువుల సూటిపోటి మాటలను తట్టుకోలేక మహిళలు కూడా అబార్షన్లకు తలవంచుతున్నారు.

బాలబాలికల నిష్పత్తిలో భారీ వ్యత్యాసం

2023–24లో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 39,861 ప్రసవాలు జరిగితే, వీటిలో 20,903 మంది బాలురు, 18,958 మంది బాలికలు జన్మించారు. 2024–25లో 35,377 ప్రసవాలు జరిగితే 18,384 మంది బాలురు, 16,993 మంది బాలికలు జన్మించారు. 2023–24లో ప్రతి వెయ్యి మంది బాలురకు 907 మంది బాలికలు జన్మించగా, 2024–25లో 924 మంది జన్మించడం గమనార్హం. ఫలితంగా జిల్లాలో బాలబాలికల నిష్పత్తిలో భారీ వ్యత్యాసం నమోదవుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మిస్తున్న శిశువులతో పోలిస్తే..ప్రైవేటు ఆస్పత్రుల్లో జన్మిస్తున్న ఆడ శిశువుల సంఖ్య చాలా తక్కువగా ఉంటుండడం గమనార్హం.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు, బాలబాలికల నిష్పత్తి

సంవత్సరం	బాలురు	బాలికలు	నిష్పత్తి
2023–24	12,424	11,458	922
2024–25	10,381	9,956	959

ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలు, బాలబాలికల నిష్పత్తి

సంవత్సరం	బాలురు	బాలికలు	నిష్పత్తి
2023–24	8,479	7,500	885
2024–25	8,003	7,037	879

మొత్తం ప్రసవాలు, బాలబాలికల నిష్పత్తి

సంవత్సరం	బాలురు	బాలికలు	నిష్పత్తి
2023–24	20,903	18,958	907
2024–25	8,384	16,993	924



ఆకులమైలారంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

'ఫ్యూచర్' బాధిత రైతులను ఆదుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

కందుకూరు: ఫ్యూచర్ సిటీలో భూములు కోల్పోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. భూ బాధితుల పక్షాన పోరాటం చేయడానికి మంగళవారం జీపు జాతను ప్రారంభించారు. మండల పరిధిలోని ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె, సార్లరావులపల్లి, సాయిరెడ్డిగూడ, ముచ్చర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫార్మాసిటీ పేరుతో అప్పటి సీఎం కేసీఆర్ 15 వేల ఎకరాలు సేకరించారని, అధికారంలోకి రాకముందు రేవంత్‌రెడ్డి ఫార్మాను రద్దు చేస్తామని చెప్పి, ఫ్యూచర్ సిటీ పేరుతో పోలీసులను అడ్డుపెట్టుకుని అదనంగా భూములు తీసుకుంటున్నారన్నారు. 2013 చట్టం ప్రకారం రైతులను సమావేశపరిచి, వారి సమ్మతితోనే భూములు సేకరించాలన్నారు. ఫ్యూచర్ సిటీ గ్రామాల్లో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే పాదయాత్రకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం హాజరుకానున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.రాంచందర్, జిల్లా కమిటీ సభ్యులు జి.నరసింహ, అంజయ్య, మండల కార్యదర్శి బి.బాల్‌రాజ్, యాచారం కార్యదర్శి ఎ.నరసింహ, నాయకులు శ్రీనివాస్, నర్సింహ, శ్రీరాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న డీఆర్‌డీఓ శ్రీలత తదితరులు

చేవెళ్ల: పేద ప్రజలకు ఉపాధి కల్పించాలనే ఆలోచనతో చేపడుతున్న ఉపాధిహామీ పనులను అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా నిర్వహించాలని డీఆర్‌డీఓ శ్రీలత అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం 2023–24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా జరిగిన ఉపాధి హామీ పనులు, గుర్తించిన లోటుపాట్లపై సిబ్బందిని వివరణ కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఏడాదిలో ఉపాధిహామీ పనులకు సంబంధించి కూలీలు, మెటీరియల్ కలిపి మొత్తం రూ.1.58 కోట్ల పనులు జరిగినట్లు తెలిపారు. దీనికి సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హిమబిందు, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కొండయ్య, ఏపీడీ చరణ్‌గౌతమ్, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సునీత, ఎస్‌టీఎం నందు, ఈసీ రాజశేఖర్, టీఏలు నాగేశ్వర్‌రావు, హరిశంకర్, పరమేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అదే డీఎన్‌ఏ

- వెంకటమాధవి హత్య కేసులో కీలక మలుపు
- తల్లి, పిల్లల డీఎన్‌ఏతో పోలిన హతురాలి డీఎన్‌ఏ
- మీర్‌పేట్ పోలీసులకు రిపోర్ట్ అందజేసిన ఫోరెన్సిక్ అధికారులు
- త్వరలోనే కోర్టుకు అందజేయనున్న పోలీసులు



వెంకటమాధవి (ఫైల్)

మీర్‌పేట: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాజీ సైనిక ఉద్యోగి గురుమూర్తి భార్య వెంకటమాధవి హత్యోదంతంలో కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. ఆమె డీఎన్‌ఏ, తన తల్లి, పిల్లల డీఎన్‌ఏతో సరిపోలినట్లు ఫోరెన్సిక్ అధికారులు నిర్ధారించారు. ఇందుకు సంబంధించిన రిపోర్ట్‌ను మంగళవారం మీర్‌పేట్ పోలీసులకు అందజేశారు. పూర్తి ఆధారాలను త్వరలోనే కోర్టుకు సమర్పించనున్నారు.

ఏంజరిగిందంటే..

మీర్‌పేట మండలం జిల్లెలగూడ న్యూ వెంకటేశ్వర కాలనీలో నివాసముండే మాజీ సైనిక ఉద్యోగి గురుమూర్తి, వెంకటమాధవి దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె సంతానం. ఈఏడాది జనవరి 14న భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో.. మాధవి తన మెడలోని మంగళసూత్రాన్ని గురుమూర్తి మొహానికి విసిరికొట్టింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆయన భార్య తలను గోడకేసి మోదడంతో అక్కడికక్కడే మృతిచెందింది. అనంతరం ఆధారాలు దొరకకుండా చేసేందుకు భార్య మృతదేహాన్ని ముక్కలుగా నరికి, బకెట్‌లో ఉడికించి, కాల్చిపొడి చేసి, నీళ్లలో కలిపి.. డ్రైనేజీలో పారబోశాడు. మరుసటి రోజు మాధవి తనతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. ఇదే విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు సీసీకెమెరాలను పరిశీలించగా గురుమూర్తిపై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసి, ఆధారాలు లేకుండా చేసినట్లు అంగీకరించాడు. హత్యా స్థలంలో ఎటువంటి క్లూస్ దొరకపోవడంతో బ్లూరేస్ టెక్నాలజీ ద్వారా ఇంట్లో, బాత్‌రూమ్‌లో రక్త నమూనాలను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఈ డీఎన్‌ఏ మాధవిదేనని ఫోరెన్సిక్ అధికారులు తేల్చారు.

వేసవి దుక్కులపై దృష్టి పెట్టండి

యాచారం: వేసవి దుక్కులపై రైతులు దృష్టి పెట్టాలని, మెట్ట పంటలు సాగు చేసే వారు తమ పొలాలను దున్నించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు సూచించారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లి రైతు వేదికలో మంగళవారం ఆయన రైతు నేస్తం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. వేసవి దుక్కులపై దృష్టి సారించాలని, బోరుబావుల్లో నీటి తగ్గుదల నేపథ్యంలో స్వల్పకాలిక పంటలు సాగు చేసుకుని అధిక ఆదాయం పొందాలని తెలిపారు. నీటి సమస్య ఉంటే పంటల సాగు తగ్గించుకోవాలన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. రేతు వేదికల వద్ద రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి రవినాథ్, విస్తరణ అధికారులు వసంత, రమేష్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- అగ్గి రాజుకుంటే బుగ్గే..
- పరిశ్రమల్లో తరచూ అగ్నిప్రమాదాలు
- వేసవి వేళ జాగ్రత్తలు ముఖ్యం
- ఎప్పటికప్పుడు తనిఖీలు చేసుకోవాలి
- సూచిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



నందిగామలోని అలైన్ ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదం (ఫైల్)

షాద్‌నగర్: వేసవి కాలం ప్రారంభమైంది.. అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది. అప్రమత్తంగా ఉండకుంటే భారీ నష్టాన్ని చవిచూడాల్సి ఉంటుంది. అగ్నిమాపక కేంద్రాలు ఉన్నా సంఘటనా స్థలానికి చేరుకునేలోపు ఉన్న ఆస్తి కాస్తా అగ్నికి ఆహుతయ్యే అవకాశం ఉంది. వేసవి నేపథ్యంలో పరిశ్రమల వర్గాలు, వ్యాపారులు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచిస్తున్న అగ్నిమాపక సిబ్బంది.

తరచూ ప్రమాదాలు

షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్ ప్రాంతాల్లో సుమారు 350కి పైగా పరిశ్రమలు ఉన్నాయి. 50 వేలకు పైగా కార్మికులు పని చేస్తున్నారు. అగ్ని ప్రమాదాలు ముఖ్యంగా కాటన్, జిన్నింగ్, ఆయిల్, హెర్బల్ పరిశ్రమల్లో అధికంగా జరుగుతున్నాయి. కోట్లాది రూపాయల ఉత్పత్తులు, యంత్రాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. పరిశ్రమల్లో పని చేసే కార్మికులు ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక భయంతో పని చేయాల్సి వస్తోంది. 11 నెలల క్రితం నందిగామలో పాత జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న అలైన్ ఫార్మా హెర్బల్ పరిశ్రమలో వెల్డింగ్ చేస్తుండగా నిప్పు రవ్వలు స్పాంజ్, థర్మాకోల్ షీట్లపై పడటంతో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఐదు నెలల క్రితం అన్నారం గ్రామ శివారులోని ఆయిల్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగి భారీ నష్టం వాటిల్లింది. ఇటీవల బైపాస్ రోడ్డులో వ్యర్థాలకు గుర్తు తెలియని వారు నిప్పంటించారు. గతంలో మొగిలిగిద్ద గ్రామ శివారులో రబ్బర్ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగింది. షాద్‌నగర్ శివారులోని బైపాస్ జాతీయ రహదారిపై వెళ్తున్న కారు నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన ఘటనలు ఉన్నాయి. భారీ ప్రమాదాలు జరిగితే షాద్‌నగర్ ఉన్న అగ్నిమాపక శకటాలతో పాటు, శంషాబాద్, రాజేంద్రనగర్, జడ్చర్ల తదితర ప్రాంతాల నుంచి శకటాలను రప్పించి మంటలను ఆర్పేస్తున్నారు.

మంటలు ఆర్పేందుకు సిద్ధంగా ఉండాలి..

వేసవి కాలం ప్రారంభం కావడంతో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. పరిశ్రమల్లో, వ్యాపార సముదాయాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉంటాయి. పరిశ్రమల నిర్వాహకులు, వ్యాపారస్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ వారు సూచిస్తున్నారు. మంటలను ఆర్పేందుకు విధిగా మంచినీటిని అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా చాలా పరిశ్రమల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదాలు జరుగుతుంటాయి. యంత్రాలకు సంబంధించిన విద్యుత్ వైర్లు సరిగా ఉన్నాయో లేదో ఎప్పటికప్పుడు తనిఖీ చూసుకోవాలని చెబుతున్నారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

సత్వరం సమాచారం ఇవ్వాలి



వేసవి కాలం పరిశ్రమలు, వ్యాపారాలు నిర్వహించే వారు అప్రమత్తంగా ఉండాలి. నీరు అందుబాటులో ఉంచుకోవాలి. ప్రమాదం సంభవించిన వెంటనే పోలీసు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలి. వెంటనే మంటలు ఆర్పేందుకు చర్యలు తీసుకుంటాం.

– జగన్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, షాద్‌నగర్ అగ్నిమాపక కేంద్రం

నీళ్లున్నా.. మోడుల్లా!





ఒకవైపు మండు వేసవి.. మరోవైపు నిండు కుండలా చెరువు.. అందులో కనిపిస్తున్న ఈ చెట్లు మాత్రం మోడుల్లా మారిపోయాయి. తుర్కయంజాల్ చెరువులో ఈ దృశ్యం కనిపించింది. పచ్చదనంతో కళకళలాడాల్సిన ఈ చెట్లు ఇలా నిలువునా ఎండిపోవడం వెనుక కారణమేంటో అంతు చిక్కడంలేదు.

– సాక్షి, రంగారెడ్డి జిల్లా

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి


లారీ కింద ఇరుక్కుపోయిన స్కూటీ


సక్కుబాయి (ఫైల్)

భర్తకు తీవ్ర గాయాలు

కొత్తూరు: రోడ్డు ప్రమాదంలో ఓ పంచాయతీ కార్యదర్శి మృతి చెందిన సంఘటన మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని రామంతాపూర్‌కు చెందిన సక్కుబాయి (38), పాండు దంపతులు. సక్కుబాయి మహేశ్వరం మండలం ఎన్‌డీతండా పంచాయతీ కార్యదర్శిగా, పాండు అంబర్‌పేట్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం ఇద్దరూ కలిసి సక్కుబాయి అమ్మగారి గ్రామమైన కొందుర్గుకు స్కూటీపై వచ్చారు. గ్రామంలో గతంలో వారు కొనుగోలు చేసిన వ్యవసాయ క్షేత్రంలో చేపడుతున్న పండ్లతోట పనులు చూసి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో తిమ్మాపూర్ వద్దకు రాగానే హెచ్‌పీ పెట్రోల్‌బంకు వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. అదే సమయంలో లారీ అదుపుతప్పి పక్కనుంచి వెళ్తున్న వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీచక్రాలు బైకుపై నుంచి వెళ్లడంతో సక్కుబాయి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలైన పాండును చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదం కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

మదర్సా నుంచి బాలుడి అదృశ్యం


సోల్‌మాన్ (ఫైల్)

పహాడీషరీఫ్: మదర్సాలో ఉండే బాలుడు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. సయ్యద్ సుల్తాన్ కుమారుడు సోల్‌మాన్(15) సైదాబాద్‌లోని జువైనల్ హోంలో ఉండడంతో, ఫౌజియా బేగం అనే సోషల్ వర్కర్ బాలుడితో పాటు మరో నలుగురిని జల్‌పల్లి కమాన్ రోడ్డు సమీపంలోని మదర్సాలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ఈ నెల 24న ఉదయం సోల్‌మాన్ ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. ఈ విషయమై ఫౌజియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ప్రేమ వివాహం చేసుకున్న యువకుడి ఇంటిపై దాడి

ఇబ్రహీంపట్నం: ప్రేమ వివాహం చేసుకున్న యువకుడి ఇంటిపై అమ్మాయి తరఫు బంధువులు దాడి చేసిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన అచ్చన మహేశ్ (21), కావ్యశ్రీ(19) ప్రేమించుకున్నారు. రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి పారిపోయి వివాహం చేసుకున్నారు. ఇది ఇష్టం లేని కావ్యశ్రీ తల్లిదండ్రులు, బంధువులు మంగళవారం మహేశ్ ఇంట్లోకి ప్రవేశించారు. మహేశ్ అక్క మౌనికపై దాడి చేయడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అమ్మాయి తల్లిదండ్రులతోపాటు 16 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన న్యాయవాది అంత్యక్రియలు

ఇబ్రాయిల్ పార్థివదేహానికి నివాళులర్పించిన వివిధ పార్టీల నేతలు, న్యాయవాదులు, ప్రజా సంఘాల నాయకులు


ఇబ్రాయిల్ అంత్యక్రియల్లో పాల్గొన్న మంద కృష్ణమాదిగ


ఇబ్రాయిల్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, నాయకులు

మహేశ్వరం: చంపాపేట్‌లో హత్యకు గురైన కాంగ్రెస్ సీనియర్ నేత, న్యాయవాది ఎర్రబాబు ఇబ్రాయిల్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామం మహేశ్వరం మండలం తుమ్మలూరులో మంగళవారం ముగిశాయి. వివిధ పార్టీల నేతలు, న్యాయవాదులు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు ఆయన నివాసానికి తరలివచ్చి పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల్లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్లు పాశం లక్ష్మీపతి గౌడ్, ఏనుగు జంగారెడ్డి, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, కృష్ణంరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్, మాదిగ న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది జయకర్ మాదిగ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

సీనియర్ అడ్వకేట్, కాంగ్రెస్ నేత ఎర్రవాపు ఇబ్రాయిల్ హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తుమ్మలూరుకు చేరుకుని ఇబ్రాయిల్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో న్యాయం కోసం పోరాడేవారికి రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇబ్రాయిల్‌ను కత్తితో పొడిచి హత్య చేసిన దస్తగిరి వెనుక ఉన్నది తేల్చాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు వామన్‌రావు దంపతుల హత్య జరిగి ఏళ్లు కావస్తున్నా నిందితులకు ఇప్పటివరకూ శిక్ష వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణ కోసం చట్టం తీసుకురావాలని కోరారు.

కోడి పందేల స్థావరంపై దాడి


పోలీసులకు చిక్కిన పందెం రాయుళ్లు

13 మంది అరెస్ట్

పహాడీషరీఫ్: గుట్టు చప్పుడు కాకుండా పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేసి 13 మందిని అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. జల్‌పల్లి గ్రామంలోని బాలాజీ వెంచర్‌లో కొన్ని రోజులుగా ఓ ముఠా కోడి పందేలు నిర్వహిస్తుంది. సోమవారం రాత్రి సైతం పందేలు నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ, పహాడీషరీఫ్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, వీరబాబు, నాగరాజు, హరీష్, వెంకటేశ్వర్, ఉదయ్ భాస్కర్ రాజ్, రవీందర్, వీర్రాజు, గోపి, వెంకట్‌రావు, బిసల్ సింగ్, అంకయ్యలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.13,610 నగదు, 16 కోడి పందేల కత్తులు, రెండు కోళ్లు, 10 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

చైన్‌స్నాచింగ్‌పై రాచకొండ సీపీ ఆరా

- బాధితురాలి నుంచి వివరాల సేకరణ
- ఘటనపై ఫిర్యాదు చేయాలని సూచన

సాక్షి ఎఫెక్ట్..

ఇబ్రహీంపట్నం రూరల్: కల్లు తాగేందుకు వచ్చి.. మహిళ మెడలో బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన దుండగులకు సంబంధించి సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు స్పందించారు. పోలీసు అధికారులను ఆరా తీశారు. గతంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారని అడిగి తెలుసుకున్నారు. సీపీ ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం హుటాహుటిన ఎంపీపటేల్‌గూడకు చెందిన బాధితురాలు తక్కలపల్లి ప్రేమలత వద్దకు వెళ్లారు. జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు చేయాలని ఆమెను కోరగా ఒప్పుకోలేదు. దీంతో సాయంత్రం తన నివాసానికి వెళ్లిన పోలీసులు ఎంత నచ్చజెప్పినా ఫిర్యాదు చేయనంటే చేయనని తేల్చి చెప్పింది. గతంలో తన బంగారు పుస్తెలతాడు పోతే నేటికి న్యాయం జరగలేదని, ఇప్పుడు కూడా ఫిర్యాదు ఇచ్చినా దండగేనని వాపోయింది. అలా ఏమీ ఉండదని, తప్పకుండా న్యాయం జరుగుతుందని పోలీసులు సూచించినా వినిపించుకోలేదు. దీంతో చేసేదేమీ లేక వెనుదిరిగారు.

ట్రేడింగ్ ఫ్రాడ్‌లో అకౌంట్ సప్లయర్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ట్రేడింగ్ ఫ్రాడ్ చేసే సైబర్ నేరగాళ్లకు అవసరమైన బ్యాంకు ఖాతాలు అందిస్తున్న గుర్‌గావ్ వాసిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడిపై దేశంలో 43 కేసులు, రాష్ట్రంలో ఆరు కేసులు ఉన్నట్లు డీసీపీ దార కవిత మంగళవారం తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన హిమాన్షు స్వామి ప్రస్తుతం గుర్‌గావ్‌లో నివసిస్తున్నాడు. ఇతడు పవన్ జైన్‌తో కలిసి బ్యాంకు ఖాతాలు సమీకరిస్తూ సైబర్ నేరగాళ్లకు అందిస్తున్నాడు. నగరానికి చెందిన ఓ వ్యక్తికి సోషల్‌మీడియా ద్వారా ఎర వేసిన సైబర్ నేరగాళ్లు ట్రేడింగ్ పేరుతో రూ.20 లక్షలు స్వాహా చేశారు. ఈ కేసు దర్యాప్తులో పోలీసులు హిమాన్షు, పవన్ పాత్రను గుర్తించారు. గుర్‌గావ్ వెళ్లిన ప్రత్యేక బృందం హిమాన్షును అరెస్టు చేసింది. పరారీలో ఉన్న పవన్ కోసం గాలిస్తోంది.

బస్సు కింద పడి మహిళ మృతి

బొల్లారం: ఉద్యోగానికి బయలుదేరిన మహిళ యాక్సిడెంట్‌కు గురై మృతిచెందిన ఘటన తిరుమలగిరి పోలీసు స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. తిరుమలగిరి పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని త్రివేణి కుమారి(43) అల్వాల్ ఎంఈఎస్ కాలనీలో నివాసం ఉంటోంది. మంగళవారం ఉదయం ఆఫీసుకు వెళ్లేందుకు లాల్‌బజార్ బస్టాప్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో ఆమెను ఓ కారు ఢీకొట్టడడంతో రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో ఈసీఐఎల్ నుంచి సికింద్రాబాద్‌కు వస్తున్న కంటోన్మెంట్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఆమె పైనుంచి వెళ్లింది. దీంతో త్రివేణి కుమారి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకుని ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కారు, బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే తన భార్య మృతి చెందిందని త్రివేణి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ నరేశ్, కారు డ్రైవర్ రమేశ్‌లపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇక్ఫాయ్- టీహబ్ మధ్య కుదిరిన ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ గణేశ్, టీహబ్ ఇన్నోవేషన్ ఆఫీసర్

శంకర్‌పల్లి: మండలంలోని దొంతాన్‌పల్లిలో గల ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన ఇక్ఫాయ్ అంకుర సంస్థ– టీ హబ్ ఫౌండేషన్ మధ్య మంగళవారం ఓ ఒప్పందం కుదిరింది. ఈ మేరకు కళాశాలలో ఇక్ఫాయ్ వైస్ చాన్సలర్ ఎల్.ఎస్.గణేశ్, టీ హబ్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ సుజిత్ జాగిర్దార్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. వీసీ గణేశ్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు పరిశ్రమలు, విద్యారంగ సాధికారత అనే అంశాలపై నాలెడ్జ్ పెంపొందించుకోవచ్చని, విద్యార్థులకు టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన వస్తుందన్నారు. సుజిత్ జాగిర్దార్ మాట్లాడుతూ.. స్టార్టప్ కంపెనీలకు సాంకేతికంగా సాయం చేసేందుకు టీ హబ్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీ హబ్ సీనియర్ ఇన్వెస్టడ్ స్టార్టప్ ఫండ్, సీనియర్ డైరెక్టర్ దేవిశెట్టి చింటిరెడ్డి, చీఫ్ డెలివరీ ఆఫీసర్ ఫణి కొండెపూడి, ఇక్ఫాయ్ రిజిస్ట్రార్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నగరానికి నిధుల కేటాయింపు అంతంతే..

అసెంబ్లీలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరం నుంచి రాష్ట్ర ఖజానాకు సింహభాగం ఆదాయం వచ్చి చేరుతున్నా..బడ్జెట్‌లో నిధుల కేటాయింపు మాత్రం మొక్కుబడిగా ఉందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీ, జలమండలికి, ఇతర సంస్థలకు నామమాత్రంగా నిధులు కేటాయించారని గుర్తు చేశారు. వాటర్‌బోర్డుకు కేవలం రూ. 3,383 కోట్లు కేటాయించారని, అందులో 3,083 కోట్లు అప్పుల చెల్లింపు, ఉచిత నీటి రియింబర్స్‌మెంట్ కింద రూ.300 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. అభివృద్ధి పనులుకు ఏ మాత్రం కేటాయించలేదని పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగు కోసం తక్షణమే రూ. 1500 కోట్లు కేటాయించాలన్నారు. జీహెచ్‌ఎంసీకి నిధులు కేటాయిపు పెంచాలన్నారు. నగర అభివృద్ధికి పెద్దపీట వేయాలన్నారు. విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు మంజూరు చేయాలని రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయ స్థలంపై వీడిన వివాదం

శంషాబాద్: పంచాయతీ అవసరాలకు స్థలాన్ని అప్పగించి ప్రత్యామ్నాయంగా తీసుకున్న స్థలం సరైందేనని హైకోర్టు తీర్పునిచ్చిందని బాధితులు చింతల రామకృష్ణ, చింతల లక్ష్మణ్ తెలిపారు. కోర్టు తీర్పువచ్చిన తర్వాత కూడా తమను కొందరు వ్యక్తులు బెదిరిస్తున్నారన్నారు. వివరాలు వారి మాటల్లోనే.. శంషాబాద్ పట్టణంలో 2001లో మహిళా మండలి భవనం వెనకాల భోజనశాల కోసం అప్పటి పంచాయతీ పాలకవర్గం మా తల్లి చింతల అన్నపూర్ణకు సంబంధించిన 430 గజాల స్థలాన్ని తీసుకుని పట్టణంలోని బృందావన్ కాలనీలో సర్వే నంబరు 687, 688 ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించారు. సంబంధిత స్థలంలో గృహ నిర్మాణానికి పంచాయతీ అనుమతి కూడా జారీ చేశారు. ఇందులో గతంలోనే కొంత స్థలాన్ని తాము విక్రయించగా మిగిలి స్థలమైన ప్లాటు నంబరు 173, 174లో ఉన్న 430 గజాల స్థలం పార్కు స్థలంగా పేర్కొంటు కాలనీ అసోసియేషన్ పలుమార్లు కోర్టును ఆశ్రయించినప్పటికీ తమకే సానుకూలమైన తీర్పువచ్చిందన్నారు. 2014 తర్వాత అసోసియేషన్ ప్రమేయంతో అప్పటి పంచాయతీ పాలకవర్గం సంబంధిత స్థలాన్ని వివాదాస్పదంగా పేర్కొంటు తీర్మానం చేయడంతో మరోసారి హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. పంచాయతీ తమ వద్ద భూమిని తీసుకుని ప్రత్యామ్నాయంగా అందజేయడానికి చేసిన బదలాయింపు డీడ్‌ను సమర్థించి హైకోర్టు తుది తీర్పును అందజేసిందన్నారు. హైకోర్టు తుదితీర్పు ఆధారంగా తాము పనులు చేసుకుంటుండగా కాలనీవాసులు 9 మంది వరకు వచ్చిన గత నాలుగైదు రోజులుగా పనులు చేస్తే బాగుండదని బెదిరిస్తున్నారన్నారు. సంబంధిత వ్యక్తులపై ఆర్‌జీఐఏ పోలీసులకు ఈనెల 19న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను ఆర్‌జీఐఏ పోలీసులతో పాటు మున్సిపాలిటీకి అందజేసినట్లు పేర్కొన్నారు.

పండగలు శాంతియుతంగా జరుపుకోవాలి

శంషాబాద్: పండగలు శాంతియుతంగా జరుపుకోవాలని శంషాబాద్ అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు సూచించారు. పట్టణంలో డీసీపీ కార్యాలయంలో మంగళవారం ఆర్‌జీఐఏ, శంషాబాద్, కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలతో శాంతికమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పండగ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానికులు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు, శంషాబాద్ సీఐ నరేందర్‌రెడ్డి మాజీ కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో అన్నదమ్ములకు రిమాండ్

వివరాలు వెల్లడించిన సీఐ సీతారామ్


నిందితులు శేఖర్, వినయ్

కందుకూరు: ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో ఇద్దరు సోదరులను అరెస్ట్ చేసిన పోలీసులు, మంగళవారం వారిని రిమాండ్‌కు తరలించారు. సీఐ సీతారామ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని సరస్వతిగూడకు చెందిన శమంత అలియాస్ శశికళకు గతంలో వివాహం కాగా భర్త చనిపోయాడు. దీంతో తన కుమార్తెను తీసుకుని హైదరాబాద్‌లోని అత్తవారి ఇంటి నుంచి పుట్టింటికి వచ్చేసింది. ఇదిలా ఉండగా శమంతకు ఇదే గ్రామానికి చెందిన మొలగాని సుధాకర్‌తో పెళ్లికి ముందు నుంచే పరిచయం ఉంది. భర్త చనిపోవడంతో పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెతో చనువుగా ఉంటున్నాడు. ఈ విషయం తెలిసిన ఆమె అన్న మాదరమోని శేఖర్(33), తమ్ముడు మాదరమోని వినయ్(27) గతంలో పలుమార్లు సుధాకర్‌ను, శమంతను మందలించారు. కొద్ది రోజుల క్రితం శమంత తన అవసరాల నిమిత్తం సుధాకర్ వద్ద కొంత డబ్బును అప్పుగా తీసుకుంది. ఈనెల 22న మధ్యాహ్నం సమయంలో తన డబ్బు ఇవ్వాలంటూ సుధాకర్ శమంత ఇంటికి వెళ్లి, కత్తితో బెదిరించాడు. ఈ సమయంలో శమంతతో పాటు సోదరులు సుధాకర్‌తో గొడవపడ్డారు. దీంతో శమంత అదే రోజు కందుకూరు పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న సుధాకర్ తన తల్లి వసంతతో కలిసి బైక్‌పై అదే రోజు సాయంత్రం కందుకూరు పీఎస్‌కు వెళ్తుండగా.. శమంత సోదరులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన సుధాకర్ చికిత్స పొందుతూ ఈ నెల 23న మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి నిందితులను పట్టుకుని, రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్‌లో మంటలు

- విద్యార్థులను దింపేసి వస్తుండగా ఘటన
- సాగర్ రహదారిపై ట్రాఫిక్ జామ్


మంటలు చెలరేగిన బస్సు...

తుర్కయంజాల్: షార్ట్ సర్క్యూట్‌తో స్కూల్ బస్‌లో మంటలు చెలరేగిన ఘటన సాగర్ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నాదరగ్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బస్సు (టీజీ08 యూ1796) ఇంజాపూర్‌లో విద్యార్థులను దింపేసి, తిరిగి వెళ్తుండగా గుర్రంగూడ వద్ద డ్రైవర్ సీటు కిందినుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సు దిగి, తోటి వాహనదారుల సహాయంతో మంటలను ఆర్పేసే ప్రయత్నం చేయడంతో పాటు ఫైరింజిన్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో సాగర్ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

చిట్టీల పుల్లయ్య చిక్కాడు!

- బెంగళూరులో పట్టుకున్న సీసీఎస్ పోలీసులు
- పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు

సాక్షి, సిటీబ్యూరో: ఆంధ్రప్రదేశ్ నుంచి నగరానికి వలసవచ్చి, కూలీగా జీవితం ప్రారంభించి, చిట్టీల వ్యాపారంలోకి దిగి, అధిక వడ్డీ ఆశ చూపి దాదాపు రూ.100 కోట్ల మేర కాజేసిన పుల్లయ్యను సిటీ సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. గత నెల 21 నుంచి పరారీలో ఉన్న ఇతగాడిని బెంగళూరులో అదుపులోకి తీసుకున్న అధికారులు పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని చందన లక్ష్మింపల్లి గ్రామానికి చెందిన పుల్లయ్య తన స్వగ్రామంలోనూ చిట్టీల వ్యాపారం చేసి పలువురిని మోసం చేశాడు. దాదాపు 18 ఏళ్ల క్రితం నగరానికి వలసవచ్చిన ఇతగాడు బీకే గూడ దాసారం బస్తీలో చిన్న గుడిసె వేసుకుని జీవించాడు. కుమారుడు రామాంజనేయులు తాపీ మేస్త్రీగా, పుల్లయ్య తాపీ పనిలో కూలీగా పని చేసే వాడు. ఇలా స్థానికులతో పాటు దాసారం బస్తీలో ఉండే రిక్షా కార్మికులతో పరిచయాలు పెంచుకున్నాడు. 15 ఏళ్ల క్రితం చిట్టీల వ్యాపారం ప్రారంభించిన ఇతగాడు బిల్డర్లకు ఫైనాన్స్ కూడా చేశాడు. పశ్చిమ మండలంలోని ఎస్సార్‌నగర్, బల్కంపేట, బీకేగూడ, సనత్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన దాదాపు 500 మంది ఇతడికి ఖాతాదారులుగా మారారు. రూ.5 లక్షల నుంచి రూ.కోటి వరకు విలువైన చిట్టీలు వేశాడు. ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ నమ్మకం సంపాదించుకున్న పుల్లయ్య ఆపై ఆ మొత్తాలు తమ వద్దే ఉంచి, వడ్డీలు తీసుకునేలా చేశాడు. ఇలా దాదాపు రూ.100 కోట్ల వరకు కాజేసిన ఇతగాడు గత నెల 21న కుటుంబంతో సహా పారిపోయాడు. బాధితులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎస్సార్‌నగర్‌లో నమోదైన కేసునూ ఈ విభాగానికే బదిలీ చేశారు. ముమ్మరంగా గాలించిన అధికారులు పుల్లయ్యను బెంగళూరులో పట్టుకున్నారు. ఈ కేసులో అతడి భార్య, కుమారుడు సైతం నిందితులుగా ఉండటంతో వారి కోసం గాలిస్తున్నారు. కాజేసిన సొమ్మును పుల్లయ్య ఎక్కడకు మళ్లించాడు? తదితర వివరాలు ఆరా తీస్తున్నారు.

మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం

బంట్వారం: మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్ గఫార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లలు అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం చేరవేయాలన్నారు. సైబర్ నేరాలు, సీసీ కెమెరాలు, ఫొటో మార్ఫింగ్స్, పోక్సో చట్టం తదితర అంశాలపై ఆయన వివరించారు.

ఆటో బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన బందయ్య, అంజమ్మ

పరిగి: ఆటో బైక్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి స్కూల్ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బందయ్య, అంజమ్మ పరిగి నుంచి ఇంటికి వెళ్తుండగా కొడంగల్ వైపు నుంచి వస్తున్న ఆటో బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 సహాయంతో పరిగి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నగరానికి తరలించినట్టు సమాచారం. ఈ రోడ్డు ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

మోమిన్‌పేట: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. అంరాధికలాన్ గ్రామానికి చెందిన ఈర్లపల్లి కుమార్(42) కుటుంబ అవసరాల కోసం, రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొడుకుకు చికిత్స చేయించేందుకు అప్పు లు చేశాడు. ఇవి తీరే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై గత ఆదివా రం ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఉస్మానియాకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.